నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట: విద్యుత్ సంబధ మరమ్మతు పనుల కారణంగా చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. వినయ్‌నగర్ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం గం'' 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సింగరేణి, భానునగర్, వినయ్‌నగర్, ఎస్ఎస్నార్, బిఎస్ఎన్ఎల్, శ్రీనివాస నగర్, బాలాజీనగర్ విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ వినియోగ దారులు సహకరించాలని కోరారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.29, వంకాయ రూ.35, బెండ రూ.55, పచ్చిమిర్చి రూ.55, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.40, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.24, ఉల్లిగడ్డ రూ.26, గోకరకాయ రూ.50, దోసకాయ రూ.18, సొరకాయ రూ.13, పొట్లకాయ రూ.21, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.75, చామగడ్డ రూ.28, మునగ రూ.55, కందగడ్డ రూ.45, బీట్‌రూట్ రూ.25, కీర రూ.40, బీన్స్ రూ.90, క్యాప్సికమ్ రూ.77. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

డిప్యూటీ కమిషనర్ల బదిలీ


వంశీకృష్ణ


మల్లీకార్జున రావు

ఎల్‌బీనగర్: హయత్‌నగర్, ఎల్‌బీనగర్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు బదిలీ అయ్యారు. హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న డాక్టర్ తిప్పర్తి యాదయ్య శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, ఖైరతాబాద్ జోన్ల పారిశుద్ధ్య విభాగం డీసీగా నియమించారు. ఆయన స్థానంలో మూసాపేట సర్కిల్ డీసీ ఉన్న వంశీకృష్ణ నియమితులైనారు. ఎల్‌బీనగర్ డీసీగా ఉన్న సేవ ఇస్లావత్ మూసాపేటకు బదలీకాగా, ఆయన స్థానంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న మల్లీఖార్జునరావు ఎల్‌బీనగర్ డీసీగా బదిలి అయ్యారు.

హనుమాన్ ఆలయ హుండీ లెక్కింపు



చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజినేయ స్వామి ఆలయ హుండీని శుక్రవారం లెక్కించారు. భక్తులు స్వామివారికి కానుకల రూపంలో 112 రోజులకు గాను రూ.55,14,153 నగదు, 53 యూఎస్ఏ, కెనడా, శ్రీలంక రూ. 200, కువైట్ దీనార్ 1, కతార్ రియోల్స్ 11, యూకే ఫౌండ్స్ 5, యూఏఈ దినార్‌లు 10 సమర్పించారని ఆలయ ఈఓ లావణ్య తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎండోమెంట్ పర్యవేక్షణాధికారి ప్రేంకుమార్, ఆలయ అర్చకులు అంబయ్య, సంతోష్‌కుమార్, శ్రవణ్‌కుమార్, సిబ్బంది రమాదేవి, వెంకటయ్య, ఆలయ పాలక మండలి చైర్మన్ సత్యనారాయణరెడ్డి, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి మృతి



హస్తినాపురం: అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిదిలో శుక్రవారం చోటు చేసుకుంది. వనస్థలిపురం పోలీసులు తెలిపిన మేరకు.. ఇంజాపూర్ గ్రామం కమాన్ అంబేద్కర్ విగ్రహం ప్రక్కన బస్‌స్టాప్ వెనకాల గుర్తు తెలియని మృతదేహం పడిఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ అనిల్‌కుమార్ వెళ్లి పరిశీలించగా మృతుడికి 28 నుండి 32 సంవత్సరాల వయస్సు ఉంటుందన్నారు. అతని శరీరంపై ఎలాంటి గాయాలు లేవన్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమత్తిం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

మలక్‌పేట: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మూసారంబాగ్ శ్రీచైతన్య స్కూల్లో శుక్రవారం విద్యార్థి నాయకులను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యక్తిని, వ్యవస్థను శక్తిగా మార్చేది కేవలం నాయకత్వమే లక్షణమేనని పేర్కొన్నారు. చక్కని భావజాలం, విశాల దృక్పదం, సామాజిక సేవాభావం కలిగిన నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేస్తున్న వాకింగ్ ట్రాక్



పూర్తయ్యేదెన్నడో?

ఐదేళ్లవుతున్నా ముందుకు సాగని సరూర్‌నగర్ ట్రాక్ పనులు

చైతన్యపురి: మినీట్యాంక్ బండ్‌గా ప్రసిద్ధి చెందిన సరూర్‌నగర్ చెరువు చుట్టూ నిర్మాణం జరగుతున్న వాకింగ్ ట్రాక్ పనులు నాలుగేళ్లుగా నత్తనడకన సాగి ప్రస్తుతం ఆగిపోయాయి. మిషన్ కాకతీయ ఫేజ్–4లో బాగంగా రూ 9.5 కోట్ల వ్యయంతో వాకింగ్ ట్రాక్ పనులు 2020 జూన్ లో ప్రారంభమయ్యాయి. వాకింగ్ ట్రాక్ మినీట్యాంక్ బండ్‌కు మణిహారంగా 'సెంటర్ ఆఫ్ అట్రాక్షన్'గా మారుతుందనిత అందరూ బావించారు. అయితే పనుల్లో పురోగతి మాత్రం శూన్యం. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ కోసం మట్టి పోసి కట్ట తయారు చేశారు తప్ప మిగిలిన పనులు మాత్రం ముందుకు సాగలేదు. అధికారులు గతంలో ప్రకటించిన


వాకింగ్ ట్రాక్ పక్కన పేరుకుంటున్న చెత్త

ప్రకారం 2021 జూన్‌లోగా పనులు పూర్తి కావాల్సి వుంది. కానీ ఎక్కడ గొంగళి అక్కడే అన్నట్లు పనులు ఉన్నాయి.ఓల్డేజ్ హోం నుంచి తపోవన్ కాలనీ వరకు 6.5 మీటర్ల వెడల్పుతో సుమారు రెండు కిలో మీటర్లు ట్రాక్ పనులు చేపట్టారు. మొదట్లో మార్చి 2022 కల్లా పూర్తి చేస్తామని అప్పట్లో అధికారులు ప్రకటించారు. ట్రాక్ ఇరువైపులా ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయాల్సి వుంది. దీంతో ప్రజాధనం వృథా అవుతోంది.

వారంలో పనులు ప్రారంభిస్తాం..

వాకింగ్ ట్రాక్ పనులు పొందిన కాంట్రాక్టర్ వేరే వ్యక్తికి సబ్ కాంట్రాక్ట ఇవ్వగా మధ్యలోనే వదిలి వెళ్లిపోవటంతో ఆలస్యం అయిన మాట వాస్తవమే. వేరే కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించి చేయించాలని నిర్ణయించాం. అనుమతులు రాగానే వచ్చేవారం పనులు తిరిగి ప్రారంభం అవుతాయి. రెండు, మూడు నెలల్లో పూర్తి చేసి అంబాటులోకి లె స్తాం.

– టి.సతీష్, ఇరిగేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

రూ.300కోట్లతో అభివృద్ధి


వివరాలు వెల్లడిస్తున్న కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: సరూర్‌నగర్, లింగోజిగూడ డివిజన్లలో రూ.300కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు జీహెచ్ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం లింగోజిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్ నుంచి సరూర్‌నగర్ కట్టవరకు త్వరలో రోడ్డు వెడల్పు కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. రోడ్డు వెడల్పు కార్యక్రమంలో బాగంగా నష్టపోతున్న 171 ఆస్తులు గుర్తించామని, వారందరికి నోటీసులు అందించామని తెలిపారు. నష్టపరిహారం చెల్లించి రోడ్డు వెడల్పు కార్యక్రమం చేపడుతామని స్పష్టంచేశారు.

బాలల సంక్షేమమే ఫోరం లక్ష్యం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న బాలల హక్కుల సంరక్షణ ఫోరం అధ్యక్షుడు అజయ్ కార్తీక్

చంపాపేట: రాష్ట్రంలోని బాలల హక్కుల సాధన, సంక్షేమమే చైల్డ్ రైట్స్ ఆండ్ ప్రొటెక్షన్ ఫోరం లక్ష్యమని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ, ఫోరం అధ్యక్షుడు అజయ్ కార్తీక్ అన్నాడు. శుక్రవారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ లోని ప్రైవేట్ పాఠశాలలో ఫోరం కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా అజయ్ మాట్లాడుతూ...చదువుకోవాలని కుతూహలం ఉండీ చదువుకు దూరంగా ఉన్న పేద పిల్లలను బడి బాట పట్టించేందుకు ఫోరం సభ్యులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు.

బోనాల ఉత్సవాల చెక్కుల పంపిణీ

సైదాబాద్: దేవాదాయ శాఖ ద్వారా మంజూరయ్యే నిధులను ఆలయాల అభివృద్ధికి, బోనాల ఉత్సవాల ఏర్పాట్లకు సద్వినియోగం చేసుకోవాలని యాకత్‌పురా నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ సామ సుందర్‌రెడ్డి ఆలయాల కమిటీల ప్రతినిధులకు సూచించారు. శుక్రవారం ఐఎస్‌సదన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని పలు ఆలయాల కమిటీ ప్రతినిధులకు చెక్కులు అందజేసారు. కార్యక్రమంలో పలు ఆలయాల కమిటీ ప్రతినిధులు నాగరాజు, నగేష్, విక్రం, దర్గయ్య, సాయి, మహేష్, పద్మారావు, వెంకటేష్, బాబు పాల్గొన్నారు.



బోనాల చెక్కులు పంపిణీ చేస్తున్న సామ సుందర్‌రెడ్డి

స్థానిక సమస్యలు తెలుసుకున్న కార్పొరేటర్


సాయినగర్‌లో కార్పొరేటర్‌కు సమస్య వివరిస్తున్న కాలనీవాసులు

మలక్‌పేట: మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి శుక్రవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి డివిజన్‌లో పర్యటించారు. సాయినగర్, మూసారంబాగ్, గడ్డిఅన్నారం ప్రాంతాలలో బోనాల పండుగకు అమ్మవారి ఆలయాల వద్ద జరుగుతున్న పనులు పరిశీలించారు. ఆలయాల నిర్వాహకులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలకు రూ.30 లక్షల నిధులతో రోడ్లు, ప్యాచ్‌వర్క్స్, వాల్ పెయింటింగ్, లైట్లు, తదితర వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర వ్యాప్తంగా బీసీ భావజాలాన్ని చాటాలి

నాగోలు: రాష్ట్ర వ్యాప్తంగా బీసీ భావ జాలాన్ని చాటాలని మన ఆలోచన సాధన సమితి (మాస్) రాష్ట్ర అధ్యక్షులు కటకం నర్సింగ్‌రావు అన్నారు. మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర కార్యవర్గం సమావేశం నాగోలులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ బీసీలలో చైతన్యం కోసం రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 37 నియోజకవర్గాలలో ఆగస్టు 3న గ్రామ గ్రామన జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే జెండా ఆవిష్కరణ సందర్భంగా బీసీ భావజాలాన్ని బలంగా వాప్తింపజేయాలని సూచించారు. గౌరవ అధ్యక్షులు గడ్డం నరసింహ గౌడ్, పూస నరసింహ బెస్త, నేరెళ్ల దేవేందర్, గుండ్ల ఆంజనేయులు గౌడ్ , పంతంగి విట్టలయ్య గౌడ్ పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


ఆర్‌కేపురంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: స్థానిక ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు ఆమోదం చేసిన తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి, ఇతర మంత్రుల చిత్ర పటాలకు ఆర్‌కేపురం డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు కేఎల్ఆర్, దేప భాస్కర్ రెడ్డి పిలుపు మేరకు ఆర్‌కేపురం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, రామకృష్ణ పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్ నేత పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభాస్యం



నాగోలు: డివిజన్ పరిధిలోని జైపురికాలనీ బ్లేజ్డ్స్ కాలనీలోని అంగన్‌వాడి కేంద్రంలో శుక్రవారం అక్షరాభ్యాసం–అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అంగన్ వాడి టీచర్లు అక్షరాబ్యాసం చేయించారు. అనంతరం చిన్న పిల్లలకు అన్న ప్రాసన చేయించారు. అంగన్ టీచర్ బి. లలిత , బ్లేజ్డ్స్ కాలనీ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ



నాగోలు: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జన్మదిన సందర్భంగా నాగోలు బండ్లగూడ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం నాగోలు డివిజన్ బీజేవైఎం ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పండ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ పాల్గొని విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. బీజేపీ నాయకులు సిద్ధల ఐల య్య, పంగ శ్యామ్ కుమార్, సంజీవ రెడ్డి, పాల్గొన్నారు.

ప్యాచ్‌వర్క్ పనుల పరిశీలన

మన్సూరాబాద్: డివిజన్ పరిధి సరస్వతినగర్‌కాలనీలోని సీసీ రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులను కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రానున్న బోనాల ఉత్సవాలను దృష్టిలో పెట్టుకుని డివిజన్ పరిధితో గుంతల పడిన రోడ్లకు ప్యాచ్‌లు వేస్తున్నామన్నారు. ఇంజనీరింగ్ డీఈ కనకయ్య, ఎఈ స్వప్న, వర్క్ ఇన్స్పెక్టర్ సీతారాం, కాలనీవాసులు పాల్గొన్నారు.

వికలాంగులకు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం కల్పించాలి

చాదర్‌ఘాట్: వికలాంగులకు స్థానిక సంస్థల్లో రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని స్థానిక సంస్థల్లో వికలాంగుల ప్రాతినిధ్య సాధన సమితి చైర్మన్ ఎండీ షఫీ అహ్మద్ ఖాన్ కోరారు. సమితి ప్రతినిధులతో కలిసి శుక్రవారం ముఖ్యమంత్రి ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పలు రాష్ట్రాలలో ఈ అంశం అమలు అవుతుందని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల లోపే ప్రక్రియ పూర్తి చేయాలని వారు కోరారు. తమ వినతికి సీఎం ఓఎస్‌డీ సానుకూలంగా స్పందించారని సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌పీఆర్‌డీ ఇండియా జాతీయ అధ్యక్షుడు రాజేందర్, సమితి వైస్‌చైర్మన్ మల్లిఖార్జున్, యాదగిరి, శబరి చావ్ల, విజయసింహా రెడ్డి పాల్గొన్నారు.


సీఎం ఓఎస్‌డీకి వినతి పత్రమిచ్చిన దివ్యాంగులు

రసాయనాల మురుగుతో ఇబ్బందులు


ఓపెన్‌నాలాలో పారుతున్న రసాయన వ్యర్థాల మురుగును చూపిస్తున్న సెవెన్‌హిల్స్‌కాలనీ వాసులు

మన్సూరాబాద్: ఆటోనగర్ పారిశ్రామిక వాడ నుంచి వచ్చే రసాయన వ్యర్థాలతో ఏడు కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సెవన్‌హిల్స్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరక్టర్ కత్తుల రాంబాబు అధికారులు, ప్రజాప్రతినిధులపై మండిపడ్డారు. శుక్రవారం కాలనీలోని ఓపెన్ నాళాలలో పారుతున్న రసాయన వ్యర్థాలను కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటోనగర్ పారిశ్రామిక వాడ నుంచి రసాయనాలు నాలాల్లోకి వదులుతుండటంతో హిమపురికాలనీ, సౌత్ ఎండ్‌పార్కుకాలనీ, ప్రైస్ కాలనీ, డీపీనగర్, ద్వారకనగర్, స్వాతిగార్డెన్స్‌తో పాటు సెవన్‌హిల్స్‌కాలనీవాసులు తీవ్ర దుర్వాసనతో చర్మసంబంధిత వ్యాధులతో బాధలు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు శోభన్‌బాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో ఉన్న పార్కుల అభివృద్ధి కి కృషి చేస్తానని, హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీలోని పార్కు అభివృద్ధికి కృషి చేస్తానని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. శుక్రవారం కార్పొరేటర్ సుజాతనాయక్ ఎల్‌బీనగర్ జోనల్ కమీషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ను కలిసి చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాతనాయక్ మాట్లాడుతూ రాబోయే బోనాలు, వినాయక చవితి పండుగలను జరుపుకునేందుకు ఆయాకాలనీల దేవాలయాలకు నిధులు మంజూరు చేయాలని జోనల్ కమీషనర్‌కు కోరారు.


జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో చర్చిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

శాకాంబరీ అలంకరణలో అమ్మవారు




అమ్మవారి పూజల్లో పాల్గొన్న నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు

సైదాబాద్: ఆషాఢ మాసం సందర్భంగా శుక్రవారం పురస్కరించుకొని సైదాబాద్ మాతామైదాన్‌లో కొలువుదీరిన విజయదుర్గా మాతా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమస్త జీవకోటి ఆకలి తీర్చే అమ్మవారు శాకాంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారిని వివిధ కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, సైదాబాద్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి పాల్గొన్నారు.

శాకాంబరీగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని వాసవి కాలనీలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత ఆలయంలో శుక్రవారం శాకాంబరీ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని పండ్లు, కూరగాయలతో శాకాంబరీ మాతగా అలంకరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


వనస్థలిపురంలో..

వనస్థలిపురం: వనస్థలిపురం హుడా ఓపెన్ ఆడిటోరియం సమీపంలోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో శుక్రవారం శాకాంబరి ఉత్సావాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ నీళ్ల అంజన్‌కుమార్‌గౌడ్, వీరాస్వామి గౌడ్, గోవర్ధన్ గుప్త పాల్గొన్నారు.

నిమ్మకాయల అలంకరణలో దుర్గాదేవి

మన్సూరాబాద్: ఆషాడ మస మహోత్సవాలు నాగోలు డివిజన్ పరిధి శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి ఆలయంలో ఘనంగా జరుగుతున్నాయి. ఆషాడ శుక్రవారం సందర్భంగా అమ్మవారిని దుర్గామాతను నిమ్మకాయలతో అలంకరించారు. భక్తులు హాజరై దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్, యాదగిరి, హనుమంతరావు, రమణమూర్తి, అజయ్, మురళి, అర్చకులు బాల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆలయాల వద్ద మెరుగైన వసతులు కల్పించాలి

సైదాబాద్: బోనాల మహోత్సవాలు పురస్కరించుకొని ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని అమ్మవారి దేవాలయాల వద్ద భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా ఆలయాల కమిటీ ప్రతినిధులు మెరుగైన వసతులు కల్పించాలని కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం డివిజన్‌లోని డీఎస్‌నగర్ ఆదమ్మ దేవాలయంలో కార్పొరేటర్ నూతన రంగులు వేసే పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆలయాల వద్ద ఏమైనా సమస్యలు కానీ, మరమ్మతు పనులు చేయించాల్సి ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.


ఈదమ్మ ఆలయ గోడలకు రంగులు వేసిన కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి